నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, ఆదివారం 1 జూన్ 2025 | BHADRADRI KOTHAGUDEM

గిరిజన మ్యూజియం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- రూ.కోటి నజరానా అందుకున్న పీవో

భద్రాచలం, మే 31 : గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు కొనసాగించే విధంగా గిరిజన మ్యూజియం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం అభివృద్ధికి మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్(మోట) న్యూఢిల్లీ వారు ప్రకటించిన రూ.కోటి నజరానా అందుకున్న పీవో.. యూనిట్ అధికారులకు శనివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ అన్ని హంగులతో తీర్చిదిద్దిన ట్రైబల్ మ్యూజియం గత నెల 7న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాటి నుంచి సందర్శకులు, పర్యాటకులు మ్యూజియంలో ఆదివాసీ వంటకాలను రుచిచూస్తున్నారని ఆహ్లాదం పొందుతున్నారన్నారు. ఇటీవల సందర్శించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్కలు పాతతరం కళాఖండాలను చూసి అన్ని ఐటీడీఏల్లో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారన్నారు. కాగా.. శుక్రవారం హైదరాబాద్ తాజ్ బంజారాలో మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ న్యూఢిల్లీ వారు ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌కు తనకు ఆహ్వానం అందిందని, అక్కడ గిరిజన సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మ్యూజియం ఏర్పాటు, అభివృద్ధి తదితర విషయాల గురించి వివరించినట్లు చెప్పారు. మ్యూజియం అభివృద్ధి కోసం రూ.కోటి నజరాన ప్రకటించి తనను సత్కరించడం ఆనందంగా ఉందని పీవో పేర్కొన్నారు.

రూ.కోటి నజరానా అందుకుంటున్న పీవో రాహుల్

సీనియర్లకు మొండిచేయి

- రాష్ట్రస్థాయి కమిటీల్లో పెద్దలకే ప్రాధాన్యం
- మంత్రులు, ఎంపీలకే పార్టీ పదవులు
- సీనియర్, ద్వితీయశ్రేణి నాయకుల్లో రగులుతున్న అసంతృప్తి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలకు మళ్లీ భంగపాటు

ఖమ్మం, మే 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్టీ పదవులను ఆశించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలకు మరోసారి భంగపాటు తప్పలేదు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో జెండాను మోసి ఉమ్మడి జిల్లాలో పార్టీ విజయానికి తీవ్రంగా శ్రమించిన సీనియర్ నేతలకు నిరాశే మిగిలింది. ఏఐసీసీ గురువారం ప్రకటించిన రాష్ట్రస్థాయి కమిటీల జాబితా.. ఉమ్మడి జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఈ పదవులపై ఆశ పెట్టుకున్న సీనియర్ కాంగ్రెస్ నేతలు, ద్వితీయ శ్రేణి నేతలు, వారి అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కమిటీల ఏర్పాటులో ఉమ్మడి జిల్లాకు సరైన ప్రాధాన్యం లభించలేదన్న అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. పీసీసీ కార్యవర్గాన్ని ఇంకా ప్రకటించనప్పటికీ పార్టీ బలోపేతం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు సహా కాంగ్రెస్ నేతలతో ఏఐసీసీ ఐదు కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో రాజకీయ సలహా కమిటీలో మాత్రం ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు స్థానం లభించింది. రెండునెలలుగా ఆయా కమిటీల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తున్న తరుణంలో ఆ పార్టీ సీనియర్ నేతలు ఈ సారైనా తమకు పార్టీపరంగా గుర్తింపు లభిస్తుందని, తాము అందించిన సేవలకు ఫలితం దక్కుతుందని, కమిటీలో అవకాశం వస్తుందని ఆశించారు. అయితే, సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న సీనియర్ కాంగ్రెస్ నేతల పేర్లు జాబితాలో లేకడంతో హతాశయులయ్యారు. రాజకీయ సలహా కమిటీలో స్థానం లభించిన నలుగురు నేతలు కీలక పదవుల్లో ఉన్నవారే కావడంతో సీనియర్, ద్వితీయ శ్రేణి నేతలకు అవకాశం కల్పిస్తే పార్టీ కోసం పని చేసినందుకు ఫలితం దక్కిందన్న సంతృప్తి కార్యకర్తల్లో ఉండేదని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులకు సరైన గుర్తింపు లభించడం లేదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ కమిటీల కూర్పు ఆ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లుగా ఉందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసున్న వారికి, కాంగ్రెస్ జెండా మోసిన సీనియర్లకు పార్టీలోనూ, పదవుల్లోనూ ఏ రకమైన ప్రాధాన్యమూ లభించడం లేదని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పార్టీ నేతలు తమతోపాటు పార్టీలోకి వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తున్నారే తప్ప.. పార్టీని కంటికిరెప్పలా కాపాడుకున్న వారికి అవకాశాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ కమిటీల్లోనూ దక్కని చోటు..

ఏఐసీసీ ప్రకటించిన రాజకీయ సలహా కమిటీలోనూ, ఇతర కమిటీల్లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలకు అవకాశం లభిస్తుందని జిల్లా పార్టీ వర్గాలు భావించాయి. సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి వెంకటరెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి, కొత్తగూడేనికి చెందిన ధర్మారావు, నాగా సీతారాములు, ఖమ్మానికి చెందిన జావేద్, కొత్తా సీతారాములు, బుక్కా కృష్ణవేణి వంటి నాయకులకు ఆయా కమిటీల్లో స్థానం లభిస్తుందని జిల్లా కాంగ్రెస్ వర్గాలు, ఆయా నేతల అనుచరగణాలు భావించాయి. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులుండగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు మాత్రమే రాజకీయ సలహా కమిటీలో అవకాశం కల్పించారు. సీనియర్ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావుకు పార్టీ పదవుల్లో అవకాశం ఇవ్వలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పోరిక బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డిలకు మాత్రమే రాజకీయ సలహా కమిటీలో అవకాశం లభించింది. ఉమ్మడి జిల్లాలోని పది శాసనసభా స్థానాల్లో రిజర్వుడు స్థానాల నుంచి గెలిచిన ఐదుగురు గిరిజన శాసనసభ్యులకు ఈ కమిటీల్లో స్థానం లభించలేదు. కాంగ్రెస్ విజయంలో కీలక భూమిక పోషించిన ఉమ్మడి ఖమ్మంజిల్లాకు తగిన ప్రాధాన్యం దక్కలేదనడానికి ఇదే నిదర్శనమంటూ కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానించాయి. తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

ఇంక్రిమెంట్లపై విషం!

- ఆందోళనకు సిద్ధమైన జూనియర్ కళాశాలల అధ్యాపకులు
- ఇంటర్ స్పాట్‌లో నల్లచొక్కా, నల్లబ్యాడ్జీలతో నిరసన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ఖమ్మం అర్బన్, మే 31 : ఎన్నో సంవత్సరాలు వేడుకున్నారు.. మరెన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చారు.. కాళ్లరిగేలా తిరిగారు.. తమ బాధలను ఎలా చెప్పాలో అలా వ్యక్తపరిచారు. ఏంచేసినా ఆంధ్రా పాలకులు కనికరం చూపలేదు కదా కనీసం స్పందించలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చింది. వారికి మాట ఇచ్చిన ప్రకారం వెనువెంటనే అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తూ 2023 మేలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోద ముద్రవేశారు. ఆయా అధ్యాపకుల కుటుంబాల్లో నూతన వెలుగులు వచ్చాయి.. తమకు ఏ సమస్యలు లేవని ఆనందంగా ఉంటున్న అధ్యాపకుల జీవితాలపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. కాంగ్రెస్ సర్కార్‌లో అధ్యాపకులకు సహజంగా రావాల్సిన ఇంక్రిమెంట్లు విషయంలో విషం గక్కుతూ కుట్రలు పన్నుతున్నారు. ఫలితంగా అధ్యాపకులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి.

కేసీఆర్ ఆదుకుంటే... కాంగ్రెస్ ఆడుకుంటుంది..

కళాశాలల్లో ఒప్పంద పద్ధతిలో అధ్యాపకులుగా పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేశారు గత ముఖ్యమంత్రి కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వారు న్యాయపరమైన డిమాండ్‌తో జీతాలు పెంచండి మహాప్రభో అంటూ వేడుకున్నారు. ఏ ఒక్కరు స్పందించలేదు. కానీ తెలంగాణ రాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వారి సమస్యలు తెలుసుకుని వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేశారు. తొలుత రూ.18 వేలతో పనిచేస్తున్న వారిని రూ.27 వేలకు 50శాతం వేతనాన్ని పెంచారు. తర్వాత రూ.37,100లకు వేతనాలను పెంచారు. తర్వాత సమస్య ఉండొద్దని కేసీఆర్ పెద్ద మనసుతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో పని చేసే వారు సమస్యలు తొలగి సంతృప్తిగా ఉంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించగలరని వారిని రెగ్యులరైజ్ చేశారు.

రెగ్యులరైజ్ అయిన దగ్గర నుంచి ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉంటున్న వారి జీవితాల్లోకి మళ్లీ అలజడి మొదలైంది. 2023 మే 3న జిల్లాలో 132మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించారు. వీరందరూ రెండో ఇంక్రిమెంట్ తీసుకోవాల్సి ఉండగా కొందరు కుట్రలు పన్ని ఇంక్రిమెంట్లు రాకుండా అడ్డుకున్నారు. దీంతో ఒక్కసారిగా అధ్యాపకులు ఉలిక్కిపడ్డారు. సహజంగా రావాల్సిన ఇంక్రిమెంట్లను కూడా రాకుండా కాంగ్రెస్ సర్కార్‌లో అడ్డుకుంటున్నారని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు.

అధ్యాపకుల ఇంక్రిమెంట్లతో ఆటలు...

వార్షిక ఇంక్రిమెంట్‌లో జిల్లాలో కొందరు ప్రిన్సిపాల్స్ మంజూరు చేయలేదు. మరికొందరు ప్రిన్సిపాల్స్ మంజూరు చేసిన జిల్లా ఖజానాలో ఆమోదించకుండా అధ్యాపకుల ఇంక్రిమెంట్లతో ఆటలు ఆడుకుంటున్నారు. కొంతమంది వ్యక్తులు దురుద్దేశంతో కుట్రపూరితంగా వాట్సాప్ మెసేజ్‌లతో నూతన అధ్యాపకులకు రావాల్సిన రెండో ఇంక్రిమెంట్ వేయకుండా కుట్రలు పన్నారని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. శనివారం ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ జరుగుతున్న సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలు, నల్లచొక్కాలతో అధ్యాపకులు నిరసన తెలిపారు. ఆదివారం సైతం సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడతామని హెచ్చరించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి అధ్యాపకులు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

డీఐఈవో జోక్యం చేసుకోవాలి

ఏపీ సబార్డినేట్ సర్వీస్ 1996, రూల్ నెంబర్ 18 ప్రకారం రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి వార్షిక ఇంక్రిమెంట్, ప్రొబెషనరీ డిక్లరేషన్ చేపట్టాల్సిన బాధ్యత యజమానిది. ఇంటర్ విద్యాశాఖాధికారి ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి. నూతన అధ్యాపకులకు ఇంక్రిమెంట్‌ను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇప్పించాలి.

– డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, టీజీజేఎల్‌ఏ 475 స్టేట్ ప్రధాన కార్యదర్శి

ఇంక్రిమెంట్ ఆపడం అన్యాయం

2023లో రెగ్యులర్‌కాబడిన నూతన అధ్యాపకులకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఆపడం అన్యాయం. కొందరు ప్రిన్సిపాల్స్ ఖజానా అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారు. కొద్దిమంది ప్రిన్సిపాల్స్ ఇంక్రిమెంట్ చేసినప్పటికీ ఖజానా అధికారులు ఎలాంటి కారణం లేకుండా రిజెక్ట్ చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– గుమ్మడి మల్లయ్య, టీజీజేఎల్‌ఏ 475 జిల్లా అధ్యక్షుడు

'కూనంనేని'కి కోపమొచ్చింది!

- సభా వేదికపై బ్యానర్‌లో నా ఫొటో ఎందుకు పెట్టలేదు?
- పద్ధతి మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది..
- సింగరేణి అధికారులపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం

కొత్తగూడెం త్రీ ఇంక్లైన్ ప్రాంతంలో సభ వేదికపై ఎమ్మెల్యే కూనంనేని ఫొటో ఏర్పాటు చేయని అధికారులు

రామవరం, మే 31 : 'సభా స్థలిపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టారు. దానికి ప్రొటోకాల్ పాటించారు. స్థానిక ఎమ్మెల్యేనైన నా ఫొటో ఎందుకు పెట్టలేదు?' అంటూ సింగరేణి అధికారులపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది రెండోసారి అని. గతంలో 10.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు ప్రారంభోత్సవం సందర్భంగా కూడా ఇలాగే వ్యవహరించారు. ప్రజల చేత ఎన్నికైన తనను ప్రజాప్రతినిధిగా చూడరా? డిప్యూటీ సీఎంను సంస్థ సీఎండీ బలరాం దగ్గరుండి తీసుకొచ్చారు. తనను జీఎం స్థాయి అధికారి కూడా తీసుకురారా? అని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని త్రీ ఇంక్లైన్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఏరియా వర్క్‌షాప్, కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయాల ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ఫొటో లేకపోవడంపై ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులు తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అసలు కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్ ఏమిటో కూడా తనకు చెప్పేవారు లేరని, ఇదేం పద్ధతి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌లో ఉన్న పర్సనల్ విభాగం సిబ్బంది సమన్వయంతో పని చేయకపోవడం వల్లనే ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

సభ ఎందుకు రద్దు చేసుకున్నట్లు?

నూతన భవనాల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభను అర్థాంతరంగా రద్దు చేసుకున్నారు. ప్రొటోకాల్ వివాదం నేపథ్యంలో సీపీఐ పార్టీ అనుబంధ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుందనా? లేక సభ జరిగే సమయంలో సభా ప్రాంగణంలో జనాలు లేకపోవడం వల్లనా? ఏదేమైనా సభ నిర్వహించపోవడంతో ప్రాంగణం వెలవెలబోయింది. అసలు షెడ్యూల్‌లో సభ లేదని అధికారులు చెబుతుండగా.. లక్షలు పెట్టి సభా స్థలిని ఎందుకు ఏర్పాటు చేశారని కార్మికులు అంటున్నారు. దీనిపై ఏరియా జీఎం శాలెంరాజును వివరణ కోరగా.. ప్రొటోకాల్ విషయంలో కొంత పొరపాటు జరిగిందని, భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకుంటామని చెప్పారు.

పారదర్శకంగా భూ సమస్యల పరిష్కారం

- 3 నుంచి 20 వరకు మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- సదస్సుల నిర్వహణపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్ష

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, మే 31 : భూభారతి చట్టం కింద ప్రజల నుంచి భూ సమస్యలపై వచ్చే దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకొండపల్లి, బోనకల్లు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకొని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామని, భూభారతి చట్టం ప్రకారం వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని మిగిలిన మండలాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి మండలానికి తహసీల్దార్ అధ్యక్షతన ఒక బృందం, నాయబ్ తహసీల్దార్ అధ్యక్షతన మరో బృందం ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని, అవసరమైన మేర హెల్ప్ డెస్క్, దరఖాస్తులు స్వీకరించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సదస్సుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారంపై అధికారులు పూర్తి పారదర్శకంగా నిబంధనల మేరకు పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్డీసీ ఎం.రాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ అధికారులు జి.నర్సింహారావు, ఎల్.రాజేందర్‌గౌడ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాసులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు

టేకులపల్లి, మే 31 : నకిలీ విత్తనాలు అమ్ముతూ పట్టుబడితే ఆ వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయిస్తామని భద్రాద్రి జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో వ్యవసాయాధికారి అన్నపూర్ణతో కలిసి పలు విత్తన దుకాణాలను, సొసైటీ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాక్ వచ్చిన వెంటనే రికార్డుల్లో నమోదు చేయాలని, ప్రతిరోజూ సేల్స్ వివరాలను పొందుపరచాలని సూచించారు. దుకాణాల ఎదుట ధరల పట్టిక, స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులకు ఇచ్చే బిల్లులో విత్తన తయారీ తేదీ, సీడ్ బ్రాంచ్, కోడ్ స్పష్టంగా నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు మీ ప్రాంతంలో అమ్మినట్లుగానీ, ఉన్నట్లుగానీ తెలిస్తే వెంటనే పోలీసు, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. తనిఖీల్లో ఏఈవో ప్రవీణ్, శ్రావణి తదితరులు ఉన్నారు.

డెంగీ నివారణపై ముందస్తు ప్రణాళిక

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, మే 31 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో డెంగీ కేసులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య వివిధశాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో డెంగీ జ్వరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరాల అనుభవాలు, ప్రస్తుత ఏడాదిలో అమలు చేయాల్సిన ప్రణాళికలపై చర్చించారు. గత సంవత్సరం ఖమ్మం మున్సిపల్ పరిధిలో మొత్తం 69 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ముందస్తు అవగాహన కార్యక్రమాలు, ప్రజల్లో చైతన్యం కలిగించడం, హాట్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచుతూ, ప్రతిచోటా పారిశుద్ధ్యం కల్పిస్తేనే డెంగీ వ్యాప్తిని అడ్డుకోవచ్చునని అన్నారు. కార్యాచరణ ప్రణాళికను రూపొందించి తనకు సమర్పించాలంటూ అధికారులను ఆదేశించారు.

గృహ సముదాయాలు ప్రారంభించిన సీఎండీ

క్వార్టర్లను ప్రారంభించి మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 31 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ బంగ్లోస్‌లో జీఎం స్థాయి అధికారుల కోసం నూతనంగా నిర్మించిన 14 ఎంఏ టైప్ నివాస గృహ సముదాయాన్ని సంస్థ సీఎండీ బలరాం శనివారం ప్రారంభించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లుతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహ సముదాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అధికారుల నివాస గృహ సముదాయాలను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా కార్పొరేట్ పరిధిలోని రైటర్ బస్తీ, బర్మా క్యాంప్‌లో 57 ఎంఏ అపార్ట్‌మెంట్ టైప్, 96 ఎంసీ టైప్, 42 ఎండీ టైప్ క్వార్టర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అనంతరం బంగ్లోస్ ఏరియాలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ కార్పొరేట్ అధ్యక్షుడు వెంకటాచారి, అన్ని శాఖల జీఎంలు పాల్గొన్నారు.